క్లుప్తంగా

నేడు విద్యుత్ విజయోత్సవం

మియాపూర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శేరిలింగంపల్లి విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో మియాపూర్ ఆల్విన్ ఎక్స్ రోడ్డులోని సత్య భారతి కన్వెన్షన్ హాల్‌లో సోమవారం విద్యుత్ విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి విద్యుత్ శాఖ ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ప్రీ స్కూల్ ప్రారంభం



లండన్ కిడ్స్ ప్రీ స్కూల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఉషోదయ ఎన్‌క్లేవ్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన లండన్ కిడ్స్ ప్రీ స్కూల్‌ను ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. తద్వారా విద్యాసంస్థలకు మంచి గుర్తింపు వస్తుందన్నారు. కార్యక్రమంలో మాదాపూర్ కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్, లండన్ కిడ్స్ ప్రీ స్కూల్ యాజమాన్య ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శివాజీ నగర్‌లో విషాద చాయలు

శేరిలింగంపల్లి: కర్ణాటకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో శివాజీనగర్ వాసి మృతి చెందడంతో ఆ ప్రాంతంలో విషాద చాయలు నెలకొన్నాయి. కుటుంబసభ్యులు, స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శివాజీ నగర్‌కు చెందిన అంజిరెడ్డి కుటుంబసభ్యులతో కలిసి కారులో తుల్జాపూర్ బయలుదేరి వెళ్లాడు. కర్ణాటకలోని బసవ కళ్యాణ్ వద్ద పోలీసులు తనిఖీ నిమిత్తం కారును ఆపగా ఆయన కారు దిగి వారి వద్దకు వెళ్లి మాట్లాడి తిరిగి వస్తుండగా అదే సమయంలో వేగంగా వచ్చిన లారీ ముందు వెళుతున్న కారును ఢీకొంది. ఆ కారు అంజిరెడ్డిని ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు.దీనిపై సమాచారం అందడంతో కుటుంబ సభ్యులు, కాలనీవాసులు కన్నీటి పర్యంతమయ్యారు.

వామ్మో ఇదేం రోడ్డు?



గుంతలమయంగా రోడ్డు

జిన్నారం (పటాన్‌చెరు): సంగారెడ్డి–మేడ్చల్ జిల్లాల సరిహద్దులోని ఓ రోడ్డు అధ్వాన్నంగా మారింది. జిల్లా సరిహద్దులోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని బీసీ కాలనీకి, దుండిగల్ మున్సిపల్ పరిధిలోని మల్లంపేటకు అతి సమీపంలో ఉన్న ప్ర ధాన రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. దీంతో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని రోడ్డుకు మరమ్మతులు చేయాలని పలుమార్లు మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులను కోరినా ఈ రోడ్డు తమ పరిధిలోకి రాదని దాటవేస్తున్నారని స్థానిక ప్రజలు వాపోతున్నారు. భారీగా గుంతలు ఏర్పడటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని వెంటనే అధికారులు స్పందించి తక్షణమే రోడ్డును బాగుచేయించేవిధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

మియాపూర్: శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీ, సురభీ కాలనీలో జనసేన పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం కోఆర్డినేటర్ మాధవరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో 500 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన 359 మందికి అద్దాలు పంపిణీ చేశారు. డాక్టర్లు కాలనీవాసులకు సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అరుణ్‌కుమార్, సరోజా దీప్, కళ్యాణ్ చక్రవర్తి, రమేష్, శ్రవణ్, జయానంద్, పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

‘ఆకుపచ్చని శేరిలింగంపల్లి’ సాధనకు..

- ప్రత్యేకంగా 'హరితహారం' కార్యక్రమం
- విజయవంతానికి సమష్టి కృషి
- అవెన్యూ ప్లాంటేషన్ పనులకు ప్రణాళికలు
- సర్కిల్ పరిధిలో 8 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం





హుడా కాలనీ సెంట్రల్ నర్సరీలో పెంచుతున్న మొక్కలు

శేరిలింగంపల్లి: 'ఆకుపచ్చని శేరిలింగంపల్లి సర్కిల్'గా తీర్చిదిద్దేందుకు అధికార యంత్రాంగం ప్రత్యేక 'హరితహారం' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించింది. అందులో భాగంగా ప్రతి ఏటా లక్షలాది మొక్కలను నాటుతూ గ్రీనరీ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. సర్కిల్ పరిధిలోని జీహెచ్‌ఎంసీ పార్కులు, కాలనీలు,బస్తీలు ప్రధాన రోడ్లు, అంతర్గత రోడ్లు, చెరువు కట్టలు, పాఠశాలల ప్రాంగణాలు, ఆఫీసులలోని ఖాళీ స్థలాల్లో హరితహారంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని జీహెచ్‌ఎంసీ అర్బన్ బయోడైవర్సిటీ విభాగం ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు.

హరిత హారం లక్ష్యం ఇదే...

- శేరిలింగంపల్లి సర్కిల్‌లోని మూడు డివిజన్లలో ఈ ఏడాది హరితహారంలో 8 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా అధికారులు ముందుకు సాగుతున్నారు.
- ఏటా మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.
- ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్త వాటిని నాటుతున్నారు.
- ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలను భాగస్వాములు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

పక్కా ప్రణాళికతో...

- శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి డివిజన్ల పరిధిలో పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు అర్బన్ బయోడైవర్సిటీ అధికారులు ప్రణాళికను రూపొందించారు.
- సర్కిల్ పరిధిలోని డివిజన్లతో పాటు భెల్ ఎంఐజీ కాలనీల్లోనూ మొక్కలు నాటాలని నిర్ణయించారు.
- రకరకాల పూల మొక్కలతో పాటు కానుగ, నీమ్, గుల్‌మొహర్, బింగోనియా, రావి, స్పటోడియా తదితర మొక్కలు మొక్కలు నాటేందుకు సిద్ధం చేస్తున్నారు.
- కాలనీలు, పార్కులు, రోడ్లు, చెరువుకట్టలు తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటేలా ప్రణాళికలు రూపొందించారు.
- సర్కిల్‌లో పరిధిలో 34 చెరువులు, కుంటలు ఉన్నాయి. వాటిలో ఆరు సీఎస్‌ఆర్ కింద అభివృద్ధి చేస్తుండగా, మిగిలిన 28 చెరువులు, కుంటల్లోని చెరువు కట్టలపై మొక్కలు నాటేందుకు సన్నాహాలు చేపట్టారు.

నర్సరీల్లో పెద్ద ఎత్తున మొక్కల పెంపకం....

- హరితహారంలో భాగంగా ఈ ఏడాది శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో 8 లక్షల మొక్కలు నాటేందుకు అర్బన్ బయోడైవర్సిటీ అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.
- 34 కాలనీ పార్కులలోని 2 వేల చొప్పున, నల్లగండ్ల హుడా కాలనీ సెంట్రల్ నర్సరీలో 50 వేలు, నల్లగండ్ల హుడా కాలనీ ఆక్సిజన్ నర్సరీలో 1.20 లక్షలు , ప్రైవేట్ నర్సరీలో సుమారు 2.50 లక్షల మొక్కలను పెంచుతున్నారు.

అవెన్యూ ప్లాంటేషన్ కోసం..

- శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని ప్రధాన రోడ్లలో అవెన్యూ ప్లాంటేషన్ ప్రణాళికలు చేస్తున్నారు..
- ఇప్పటికే రెండు చోట్ల మొక్కలు నాటుతున్నారు.

అవెన్యూ ప్లాంటేషన్ వివరాలు..

- హెచ్‌సీయూ వెనుక గేటు నుంచి గోపన్‌పల్లి తండా వరకు
- గోపన్‌పల్లి తండా నుంచి ఎన్‌టీఆర్ నగర్ వరకు
- ఏఐజీ హాస్పిటల్ నుంచి శిల్ప లేఅవుట్ వరకు
- మెహఫిల్ హోటల్ నుంచి ఐఐఐటీ చౌరస్తా వరకు
- జవహర్ నవోదయ స్కూల్ నుంచి గోపల్‌పల్లిలోని హెచ్‌సీయూ వెనుక గేటు వరకు అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టనున్నారు.

ఎనిమిది లక్షల మొక్కలు నాటుతాం



సర్కిల్ పరిధిలో హరితహారం కింద ఈ ఏడాది 8 లక్షల మొక్కలు నాటుతాం. అందుకు అవసరమైన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశాం. సర్కిల్ పరిధిలోని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్లు, మొక్కలు నాటుకోవాలనుకునే వారు బయోడైవర్సిటీ అధికారులకు లెటర్ ప్యాడ్‌పై కోరితే అవసరమైన మొక్కలు అందజేస్తాం. వ్యక్తిగతంగా మొక్కలు కావాలనుకునే వారు ఆధార్ కార్డు అందజేస్తే 5 మొక్కల చొప్పున అందజేస్తాం.

– యూసుఫ్, మేనేజర్ అర్బన్ బయోడైవర్సిటీ, శేరిలింగంపల్లి సర్కిల్

అన్నదానం

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీ శాతవాహననగర్ పార్కు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బొమ్మా రెడ్డి వెంకటరెడ్డి సారథ్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం ముగింపు కార్యక్రమం సందర్భంగా ఆదివారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావులు విచ్చేసి అన్నదానం కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... చలివేంద్రం ముగింపు సందర్భంగా అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేయటం చాలా సంతోషకరమైన విషయమన్నారు. రోజు రోజుకూ ఎండలు విపరీతంగా పెరిగి పోవటంతో ఇక్కడ ఏర్పాటు చేసిన చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చినందుకు నిర్వాహకులను అభినందిస్తున్నానని తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి ఇటువంటి సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, హెచ్‌ఎంటీ శాతవాహననగర్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



బొమ్మారెడ్డి వెంకటరెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

కైలాష్‌నగర్ కాలనీలో విద్యుత్ ఫీడర్ ప్రారంభం



విద్యుత్ ఫీడర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

మియాపూర్: చందానగర్ డివిజన్ పరిధిలోని కైలాష్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్ ఫీడర్‌ను ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కైలాష్‌నగర్ కాలనీవాసులు గత కొన్నేళ్లుగా విద్యుత్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని తన దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు కాలనీలో విద్యుత్ ఫీడర్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. ఓవర్ లోడ్ కార ణంగా పలు మార్లు విద్యుత్ సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనేవారన్నారు. ఈ నేపథ్యంలో రాంచంద్రపురం ఫీడర్ నుండి కై లాష్‌నగర్ సబ్ స్టేషన్‌కు మార్చి సమస్యను పరిష్కరించామన్నారు. ఇకపై విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, కాలనీ అసోసియేషన్ సభ్యులు దామోదర్‌రెడ్డి, కృష్ణమూర్తి, సుధాకర్, శడాక్షరి, మౌనిక, నీలిమా తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యానికి వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల

భాగ్యనగర్‌కాలనీ: ఊరు వెళ్లొచ్చేసరికి ఇంట్లో బంగారం కనిపించకపోవడంతో బాధితులు కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన మేడిపల్లి శ్రీకాంత్, పాపారాయుడునగర్‌లో నాయిన్స్ నేచర్ అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్నాడు. ఎస్‌ఆర్‌నగర్ వెంగళరావునగర్‌లో డెంటల్ హాస్పిటల్ నిర్వహిస్తున్నాడు. గత నెల 13న కుటుంబ సభ్యులతో కలిసి తన స్వగ్రామం వెళ్లాడు. శ్రీకాంత్ 14న ఇంటికి చేరుకున్నాడు. రోజు మాదిరిగానే ఆసుపత్రికి వెళ్తూ ఇంటికి వస్తున్నాడు. అయితే గత నెల 31వ తేదీన శ్రీకాంత్ భార్య సింధు ఊరు నుంచి ఇంటికి వచ్చింది.

- తన కుమారుడి చైన్ దాచి పెట్టేందుకు బంగారం బాక్స్ తీసి చూసేసరికి అందులో ఉన్న సుమారు 70 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో వెంటనే తన భర్తకు విషయాన్ని చెప్పి పోలీసులకు సమాచారం అందజేశారు. సమాచారం అందుకున్న కూకట్‌పల్లి పోలీస్‌లు డాగ్ స్క్వాడ్, వేలిముద్ర నిపుణులు దొంగతనం జరిగిన తీరును పరిశీలించి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. దొంగతనం జరిగిన తీరును పరిశీలించిన కూకట్‌పల్లి పోలీసులు తెలిసిన వారే ఈ దొంగతనానికి పాల్పడినట్లుగా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన సమ్మర్ క్యాంప్

హఫీజ్‌పేట్: మాతృశ్రీ నగర్‌లో గత 45 రోజులుగా కొనసాగుతున్న సమ్మర్ క్యాంప్ ఆదివారం ముగిసింది. ఈ శిబిరంలో 6 నుంచి 15 ఏళ్లలోపు బాలబాలికలు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా మాతృశ్రీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అజయ్‌వేదం బాస్కెట్‌బాల్ కోచ్ జీడీఎస్‌వీ ప్రసాద్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం చిన్నారులు నిర్వహించిన నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.



సమ్మర్ క్యాంప్ పాల్గొన్న కాలనీవాసులు, చిన్నారులు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు





మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కూచిపూడి, కథక్ నృత్యాంశాలు సందర్శకులను అలరించాయి. కలైమామణి సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత శైలజ తన శిష్యులతో చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. శ్రీరామనవిబో, గోపాలక పాహిమాం, నీరదశమా, అష్టపది, తరంగం తదితర అంశాలను కళాకారులు శైలజ, ఆర్తీ వాసుదేవన్, విద్య, రష్మీ, దిలీప్‌లు ప్రదర్శించి అలరించారు. శ్రీవల్లీ శిష్యబృందం కథక్ నృత్య ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంది. గురువందన, కృష్ణవందన, శివ వందన, రవిశంకర్ తరుణ, అంశాలను మాన్య, వైభవి, ఏశస్వీనీ, యుక్త, శ్రీత, ప్రకృతిలు ప్రదర్శించి అలరించారు.





అలరించిన అస్త్ర విన్యాసం

గచ్చిబౌలి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సైబరాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం పోలీసు సురక్ష దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొండాపూర్‌లోని ఏఎంబీ మాల్ మెయిన్ ఆట్రియంలో స్పెషల్ పోలీస్ టీమ్‌తో సైలెంట్ ఆర్మ్స్ డ్రిల్ నిర్వహించారు. 50 మంది సిబ్బంది నిర్వహించిన ఈ డ్రిల్ ఆద్యంతం ఆసక్తిగా సాగింది. స్పెషల్ పోలీస్ బృందం విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీఎస్‌డబ్ల్యూ ఏడీసీపీ వెంకట్‌రెడ్డి, స్పెషల్ టీమ్ ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ సిద్ధార్థ్‌నాయక్, గచ్చిబౌలి ఎస్ఐ సురేందర్‌రెడ్డి, ఆర్ఐ అరుణ్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



రైలు ప్రమాద మృతులకు నివాళి

పటాన్‌చెరు టౌన్: ఒడిశాలో జరిగిన రైలు ప్రమాద మృతులకు ఆత్మకు శాంతి చేకూరాలని శనివారం రాత్రి బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, ఎస్ఆర్కే యువసేన సభ్యులతో కలిసి ఇస్నాపూర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా పట్టణంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో రైలు ప్రమాదంలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి విజేందర్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ రాజగోపాల్ యాదవ్, సోషల్ మీడియా ఇన్‌చార్జి సంగమేష్ పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, పక్కన డీఎస్పీ భీమ్‌రెడ్డి

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- ఘనంగా సురక్షా దినోత్సవం

పటాన్‌చెరు టౌన్: రక్తదానం.. ప్రాణదానమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో సురక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని ఇస్నాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ పోలీసుశాఖలో తెచ్చిన సంస్కరణలు విప్లవాత్మక మార్పులకు నాంది పలికిందన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజలు పోలీసులతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించేందుకు వీలు ఏర్పడిందని తెలిపారు. అనంతరం రక్తదానం చేసిన యువకులకు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పటాన్‌చెరు డీఎస్పీ భీమ్‌రెడ్డి, పటాన్‌చెరు సీఐ వేణుగోపాల్‌రెడ్డి, అమీన్‌పూర్ సీఐ శ్రీనివాసులురెడ్డి, బొల్లారం సీఐ సురేందర్‌రెడ్డి, జిన్నారం సీఐ వేణుకుమార్, బీడీఎల్ సీఐ వినాయక రెడ్డి, పటాన్‌చెరు క్రైమ్ సీఐ లాలూనాయక్, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి, ఇస్నాపూర్ సర్పంచ్ బాలమణి శ్రీశైలం, ఎంపీటీసీ అంజిరెడ్డి, పోలీసు సిబ్బంది, బీఆర్‌ఎస్ నాయకులు మెరాజ్‌ఖాన్, సందీప్, సునీల్‌రెడ్డి, రామకృష్ణ, యువకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్లెపల్లి లలితాసోమిరెడ్డి తెలిపారు. ఆదివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని లెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వరగారి రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మున్సిపాలిటీ పరిధిలో పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. ఆదేవిధంగా తడి, పొడి చెత్త వేరు చేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. గేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో జిల్లా సాంప్రదాయ ఇంధన వనరుల అధికారి మాణిక్యం , మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్ శ్రీశైలం , తెల్లాపూర్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు దేవేందర్ యాదవ్, ముప్ప ఇంద్రప్రస్థ కమిటీ అధ్యక్షులు మదన్, నాయకలు ఉమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి

మైనార్టీల సమస్యలు పరిష్కరించండి

ఎమ్మెల్యే గాంధీకి మైనార్టీ ప్రతినిధుల బృందం వినతి



ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం సమర్పిస్తున్న ముస్లిం నాయకులు

రాయదుర్గం: మైనార్టీల సమస్యలను పరిష్కరించాలని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన పలువురు ముస్లిం నాయకులు ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీని కోరారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలోని శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని, ప్రహరీ నిర్మించాలని , నానక్‌రాంగూడ లోని శ్మశాన వాటికను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని కోరారు. నియోజకవర్గ పరిధిలో ముస్లింలకు ప్రత్యేకంగా మైనార్టీ ఫంక్షన్ హాల్ నిర్మాణం చేపట్టాలని కోరారు. పలు కాలనీలు, బస్తీల్లో ముస్లిం శ్మశాన వాటికలకు ఏర్పాటుకు స్థలం కేటాయించాలని, అర్హులైన ముస్లింలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను మంజూరు చేయాలన్నారు. బస్తీ దవాఖానాల సంఖ్య ను పెంచాలని కోరారు.

దశవారీగా సమస్యల పరిష్కారం

దశలవారీగా అన్ని సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ వారికి హామీ ఇచ్చారు. వినతిపత్రం స్వీకరించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. షాదీ ముబారక్, రంజాన్ తోఫా, మైనార్టీ పాఠశాలలు, మైనార్టీ గురుకులాలను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందిస్తుందన్నారు. ముస్లిం శ్మశాన వాటికల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రత్యేకంగా ఫంక్షన్ హాల్ నిర్మాణా నికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు, ముస్లింలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా సహకరిస్తానని హామీ ఇచ్చారు. కార్య క్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు హబీబ్, అక్బర్, సయ్యద్‌పాషా, ఖాదర్‌ఖాన్, సలావుద్దీన్, నవాజ్, సయ్యద్ సర్వర్, నయీమ్, మహ్మద్ అలీ, హుస్సేన్, జహీర్‌ఖాన్, యూసుఫ్‌పాషా పాల్గొన్నారు.